సాక్షి కాకినాడ

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



సుదర్శన హోమానికి రూ.లక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది నారసింహుని ఆలయంలో సుదర్శన హోమానికి బాపట్ల జిల్లా నుండూరుకు చెందిన నాగమల్లేశ్వరరావు, కుటుంబసభ్యులు రూ.లక్ష ఇచ్చారు.



వనువులమ్మ ఆలయానికి విరాళం

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెంలో వనువులమ్మ ఆలయానికి వలవల గంగారావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు, మనుమలు రూ.2 లక్షల విరాళం అందజేశారు.

ఏదోమంత్రం చాలదు



దోమ సైజు చిన్నదే కానీ.. కుట్టిందంటే మాత్రం పెద్ద ప్రమాదమే. వర్షాలతో దోమలూ విజృంభిస్తున్నాయి. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు.. సరైన పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో దోమల వ్యాప్తి సమస్యాత్మకంగా మారింది. దీనివల్ల పల్లెలు, పట్టణాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి.

8లో

న్యూస్‌రీల్

జిల్లాలో 40.2 మి.మీ వర్షపాతం

కాకినాడ సిటీ: జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు సరాసరి 40.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తొండంగి మండలంలో 55.2, అత్యల్పంగా పెదపూడి మండలంలో 22.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా శంఖవరంలో 54.2, గొల్లప్రోలు 52.2, పిఠాపురం 51.6 కోటనందూరు 50.2, యు.కొత్తపల్లి 50.2, తుని 49.6, రౌతులపూడి 48.2, కిర్లంపూడి 46.2, ఏలేశ్వరం 45.2, ప్రత్తిపాడు 42.4, కాకినాడ రూరల్ 34.6, సామర్లకోట 34, జగ్గంపేట 32.6, పెద్దాపురం 32.2, కాజులూరు 31.2, తాళ్లరేవు 29.8, కాకినాడ అర్బన్ 29.4, కరప 29.2, గండేపల్లి 23.4, పెదపూడి 22.4 మిల్లీమీటర్లు చొప్పున కురిసింది.

'తాండవ'లో జలకళ



నీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

కోటనందూరు: తాండవ జలాశయం నీటితో కళకళలాడుతోంది. రెండు, మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షానికి నీటి నిల్వలు పెరుగుతున్నాయి. జలాశయం గరిష్ట నీటి మట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 375.5 అడుగులకు నీరు చేరినట్టు డీఈఈ అనురాధ తెలిపారు. నీటిమట్టం 378 అడుగులకు చేరితే ఆ తర్వాత వచ్చే ఇన్‌ఫ్లోకు అనుగుణంగా సముద్రంలోని నీటిని విడిచిపెడతామన్నారు.

భక్తులతో రత్నగిరి కిటకిట



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని ఆలయం సోమవారం వేలాదిగా తరలి వచ్చిన నవ దంపతులు, భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, వ్రత మండపాలు నిండిపోయాయి. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున ముహూర్తాలలో రత్నగిరిపై సుమారు 50 వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాలలో కూడా పెద్ద సంఖ్యలో వివాహాలు జరగడంతో వారంతా తమ బంధువులతో కలిసి సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారని, 2,200 వ్రతాలు జరిగాయని ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్‌తో అంతరాలయం దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుడిని దర్శించిన భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.



పిఠాపురం మండలం పి.తిమ్మాపురంలో నీట మునిగిన వరి పంట



కాకినాడ రూరల్ మండలం తమ్మవరంలో వరిపొలాల పరిస్థితి



సామర్లకోటలో నీట మునిగిన పంట పొలాలు

నాట్లు.. పాట్లు

- భారీ వర్షాలతో అతలాకుతలం
- మునిగిపోయిన వరి పొలాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు
- ముంపులో గొల్లప్రోలు
- మెట్ట ప్రాంతానికి మేలు



గొల్లప్రోలు కొత్త కాలనీ వద్ద వరద ఉధృతి



గొల్లప్రోలు కొత్త కాలనీలో గర్భిణిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లా అతలాకుతలమైంది. జనజీవనం స్తంభించింది. మూడు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న వర్షంతో జనం ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. భారీ వర్షాలతో పిఠాపురం బ్రాంచ్ కెనాల్, సుద్దగడ్డ, ఏలేరు, పంపా, తాండవ జలాశయాల్లోకి వచ్చి చేరిన నీరు మెట్ట ప్రాంతంలో ఆయకట్టు రైతులకు కాస్త ఊరటనిచ్చింది. అయితే డెల్టా ప్రాంతంలో వెదజల్లు సాగుచేపట్టిన పొలాలు ముంపులోకి వెళ్లాయి.

ముందు చూపు లేని సర్కారు

ముందు చూపు లేని సర్కారు తీరుతో పొలాలు ముంపులో ఉన్నాయి. ఖరీఫ్ నారుమళ్లు ముందుగా వేసుకుని నాట్లు ముందుగానే పూర్తి చేయాలని ప్రభుత్వం పిలుపు నిచ్చింది. దానికి తగినట్టు నీరు విడుదల చేయకపోవడంతో వరి నాట్లు జిల్లాలో ఆలస్యమయ్యాయి. ఫలితంగా మెజార్టీ రైతులు వెదజల్లుకు మొగ్గు చూపారు. పెద్దాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లోని డెల్టా ప్రాంతంలో ఇలా వెదజల్లుతో సాగుకు సమాయత్తమైన పంట పొలాలు ప్రస్తుత వర్షాలతో ముంపులో ఉన్నాయి. జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 2.10 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటికే 70 శాతం అంటే 1.70 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లాలో అత్యధికంగా తొండంగి మండలంలో 55.02 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పెదపూడి మండలంలో 22.04 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. కాకినాడ పోర్టులో మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక సోమవారం కూడా కొనసాగింది.

పొంగి పొర్లుతున్న కాలువలు

పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఏలేరు, సుద్దగడ్డ తదితర ప్రధాన పంట కాలువలు పొంగి పొర్లుతుండడంతో పొలాలు నీట మునిగాయి. పిఠాపురం మండలం పి.తిమ్మాపురం, జములపల్లి, రాయవరం, రాపర్తి, గొల్లప్రోలు మండలం లక్ష్మీపురం, చేబ్రోలు, సీతానగరం తదితర గ్రామాల్లో వరితో పాటు పత్తి పంటలు నీట మునిగాయి. ఈ మండలాల్లో వాణిజ్య పంటలు ముంపులో ఉన్నాయని రైతులు దిగులు చెందుతున్నారు. ముఖ్యంగా వెదజల్లే పద్ధతిలో వేసిన వరి పూర్తిగా నీట మునిగి రైతులు ఆవేదన చెందుతున్నారు. సుద్దగడ్డ కాలువ పొంగి ప్రవహిస్తుండడంతో గొల్లప్రోలు ఈబీసీ కాలనీ, కొత్త కాలనీ, సూరంపేట తదితర నివాస ప్రాంతాలు నీట మునిగాయి. ఏలేరు కాలువకు గత ఏడాది పడిన గండ్లు పూడ్చివేత పనులు వదిలేయడంతో నాట్లు వేసిన పొలాల్లోకి నీరు చేరిందని రైతులు చెబుతున్నారు.

పూడిక తీయక..

కాలువల్లోకి నీరు విడుదల చేసే చివరి నిమిషంలో పూడికతీత పనులు మొదలు పెట్టి అన్యాయం చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో నీరు సక్రమంగా పారుదల కాక వరద నీరు పొలాల్లోకి వచ్చేస్తోందన్నారు. ముందుగా పూడిక తీత జరిగితే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదంటున్నారు. ప్రత్తిపాడు నియోజవర్గంలో సుమారు 24 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఏలేరు పరివాహక ప్రాంతంలో పడుతున్న వర్షాలతో ఏలేరుకు వరద ఉధృతి పెరిగింది. సోమవారం ఏలేరు ప్రాజెక్టులోకి 6,100 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. దీంతో వరద నీరు ప్రాజెక్టులోకి మరింత వస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి నీటి విడుదల తగ్గించేశారు. కేవలం అక్కడి నుంచి 525 క్యూసెక్కులు మాత్రమే వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.46 మీటర్లకు 79.00 మీటర్లు, 24.11 టీఎంసీలకు 12.31 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ఇందులో విశాఖకు 200, తిమ్మరాజుచెరువుకు 20 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. ఈ ప్రాంత ఆయకట్టుకు నీటి విడుదల నిలిపివేశారు.

అదనపు జలాల విడుదల

పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట మండలం వీకే రాయపురంలో పొలాలు నీట మునిగాయి. గోదావరి కాలువలో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో నీటి మట్టం పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని బిక్కవోలు, వేట్లపాలెం గ్రామాల వద్ద గోదావరి నుంచి అదనపు జలాలను విడిచిపెడుతున్నారు. అవి మురుగు కాలువ ద్వారా సముద్రంలో కలవాలి. వేట్లపాలెం వీఆర్ నుంచి వచ్చే అదనపు జలాలు వీకే రాయపురం పొలాల మీదుగా వెళ్లడంతో అవి మునిగిపోయాయి. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులతో పాటు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వేట్లపాలెం సర్ ప్లస్ వియర్స్ గేట్లు ఎత్తివేయడం వల్ల తరచూ తమ పంట పొలాలు నీటిలో మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలతో పెద్దాపురం, సామర్లకోట మండలాల్లోని దుంప, నువ్వులు సాగుకు సానుకూలమంటున్నారు.

సహాయక చర్యలు

గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని సుద్దగడ్డ కాలువకు వరద నీరు పోటెత్తడంతో గొల్లప్రోలు కొత్త కాలనీకి రాకపోకలు నిలిచాయి. ముందు జాగ్రత్త చర్యలుగా కాలనీలో ఉన్న ముగ్గురు గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలను బోట్లపై కాలువ దాటించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

కొన్నిచోట్ల ఇప్పటికీ..

జగ్గంపేట నియోజకవర్గంలో 90 శాతం వరి నాట్లు పూర్తి కాగా, వర్షాధారంపై ఆధారపడ్డ ప్రాంతాల్లో ఇప్పటికీ నాట్లు వేస్తున్నారు. గోకవరం మండలం కామరాజుపేట, మల్లవరం, తిరుమలాయపాలెం తదితర గ్రామాల్లో వరి నాట్లు ఇప్పుడిప్పుడే జరుగుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో కిర్లంపూడి మండలంలో 350 ఎకరాలు, గోకవరం మండలం తంటికొండలో 40 ఎకరాలు, జగ్గంపేట మండలం రామవరంలో 120 ఎకరాలు, సీతానగరంలో 40 ఎకరాల పంట నీట మునిగింది. కిర్లంపూడి మండలం ఏలేరు కాలువలో 220 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

నీరుపోయే మార్గం లేక..

కాకినాడ రూరల్ మండలంలో సగం పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. తుపాను ప్రభావంతో సుమారు 250 ఎకరాల్లో వరిచేలు నీట మునిగాయి. తమ్మవరం ఏపీఐఐసీ భూములతో పాటు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ నీరు పోయే మార్గం లేక పొలాలు ముంపులో ఉన్నాయి. తుని నియోజకవర్గం పరిధిలో తాండవ ప్రాజెక్టు కింద 20 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు సానుకూలత లభించిందని రైతులు పేర్కొంటున్నారు. పంపా ఆయకట్టు పరిధిలో 12,000 ఎకరాలు వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

బార్ల లైసెన్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ క్రైం: 2025 – 2028 కాలపరిమితికి కాకినాడ జిల్లా పరిధిలో 15 బార్ల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ విషయాన్ని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు సోమవారం తెలిపారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 11 బార్లు, సామర్లకోట, తుని, పెద్దాపురం, పిఠాపురం మున్సిపాలిటీల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 15 బార్లకు అనుమతులు ఇచ్చేందుకు ఆదేశాలు వెలువడ్డాయన్నారు. జనాభా ప్రాతిపదికన 50 వేల లోపు ఉన్న మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు రూ.35 లక్షలు, 50 వేలకు పైన జనాభా ఉన్న మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్లకు ఏడాదికి రూ.55 లక్షలు చొప్పున రుసుము నిర్ణయించారు. దరఖాస్తుదారులు దరఖాస్తుతో పాటు రూ.5 లక్షల దరఖాస్తు ఫీజు, రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా హైబ్రీడ్ విధానంలో చెల్లించి కాకినాడలో ఉన్న జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలోని సంబంధిత విభాగంలో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.

రాజ్యాంగాన్ని అవమానించేలా కూటమి పాలన

- విద్యార్థులను విద్యార్థి సంఘాలకు దూరం చేసే కుట్ర
- వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుల ధ్వజం
- కాకినాడలో విద్యార్థులతో కలసి నిరసన



కాకినాడలో ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం నాయకులు

కాకినాడ సిటీ: అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానించే రీతిలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పాలన కొనసాగిస్తోందంటూ వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రాజ్యాంగాన్ని అవమానపరిచే రీతిలో వ్యవహరిస్తూ విద్యార్థుల నుంచి విద్యార్థి సంఘాలను దూరం చేసే కుట్రకు తెరతీస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పూసల అనిల్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనకు రాజ్యాంగాన్ని అందించారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం సొంతంగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తయారు చేసుకుందన్నారు. విద్యాశాఖామంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ తప్పులు ప్రశ్నించే గొంతులపై కత్తి మోపుతున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని, అన్యాయంగా జైల్లో నిర్బంధిస్తున్నారని నినాదాలు చేశారు. హాస్టళ్లు, గురుకుల విద్యాలయాలు, విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసేంత పరిస్థితికి దిగజారారని ధ్వజమెత్తారు. ఈ నిషేధం ద్వారా సంక్షేమ హాస్టళ్లన్నీ సమస్యల వలయంలో చిక్కి విలవిలలాడుతున్నాయని మంత్రి లోకేష్ ఒప్పుకున్నట్టే అన్నారు. విద్యార్థి సంఘం కాకినాడ సిటీ అధ్యక్షుడు జలగడుగుల పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఒక పక్క విద్యాసంస్థల్లో ర్యాగింగ్ కారణంగా అణగారిన వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మరో పక్క మౌలిక వసతులు లేక సంక్షేమ హాస్టళ్లన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు గండ్రేటి వినీత్ కుమార్, బోనీలి కిత్, మణికంఠ, నూతలపాటి రాజు, గన్నవరపు రాజేష్, కనిపే రవి, కంచుమర్తి నాగేశ్వరరావు, చింటూ, రాజేష్ పాల్గొన్నారు.

ఏకైక సాహిత్య సంపద మనదే



సనాతన ధర్మంపై ప్రసంగిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వేల గ్రంథాలతో అందుబాటులో వున్న ఏకైక సాహిత్య సంపద మనదని సమన్వయ సరస్వతీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. స్థానిక సూర్యకళా మందిరంలో సోమవారం రాత్రి సరస్వతీ గాన సభ ఆధ్వర్యంలో సనాతన ధర్మం – శాశ్వత న్యాయం అనే అంశంపై ఆయన ప్రవచించారు. మన భారత సాంస్కృతిక జీవనంలో ధర్మ ప్రవర్తన, న్యాయ జీవనం ఆచరింపబడుతున్న విషయాలన్నారు. వాటిని కల్పాంతరాలుగా ఆచరిస్తూ వస్తున్న ఏకైక ఆదర్శ దేశం భారతావని అని తెలిపారు. ఈ ధర్మం, న్యాయం ఒకేలా ఆలోచన చేస్తే ఒకే అర్థంలా అనిపించినా, వివరంగా ఆలోచన చేసినప్పుడు అనేక విషయాలు అర్థమవుతాయన్నారు. తప్పుడు చరిత్రలు అందుబాటులో ఉండడం దురదృష్టమని, ఈ విధానం మారి నిజం ప్రజలకు అందాలన్నారు. చాణక్య నీతి, సోమదేవ నీతి వంటి గ్రంథాలను ప్రస్తావించారు. తొలుత సామవేదానికి వేద పండితులు స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సరస్వతీ గాన సభ గౌరవాధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆ చేతులకు.. మనసుంది

- సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్న సంస్థలు
- అభాగ్యుల కష్టాలు దూరం చేసేందుకు ప్రయత్నం
- నేడు ప్రపంచ మానవతా దినోత్సవం



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించిన వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆ చేతులకు మనసుంది.. అభాగ్యులకు ఆపన్నహస్తం అందిస్తోంది. ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న అనే నానుడిని నిజం చేస్తూ సాటివారి సేవలో తపిస్తోంది. తాము పడిన కష్టం మరొకరికి రాకూడదనే ఉద్దేశంతో ముందుకు సాగుతోంది. ఇలా సేవ చేసే ప్రతి హృదయం మానవత్వం చాటుతోంది. మంగళవారం ప్రపంచ మానవత్వ దినోత్సవం సందర్భంగా సాయం చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తుల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం ఇది. సేవ చేయాలనే తపనతో జిల్లాలో సుమారు 50 వరకూ స్వచ్ఛంద సంస్థలు ఏర్పడ్డాయి. వీటికి ప్రభుత్వ రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. అలాగే మరో 150 వరకూ సంస్థలతో పాటు వ్యక్తులూ అభాగ్యుల సేవల్లో తరిస్తున్నారు. తమకున్న దాంట్లోనే సేవ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. సమాజంలో అభాగ్యులు, అనాథలు, నిరాశ్రయులకు సాయం అందించి సహృదయాన్ని చాటుతున్నారు. సమాజ శ్రేయస్సుకు పాటుపడుతూ మా చేతులకూ మనసుందని నిరూపిస్తున్నారు. అందులో కొన్ని తెలుసుకుందాం రండి..

తపనతో చదువుకుని..

పామర్తి గోపాలరావు మాస్టారుది కృష్ణా జిల్లా గుడివాడ మండలం జమీగొల్లేపల్లి. తండ్రి గీత కార్మికుడు. ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగోక పోవడంతో పదో తరగతి వరకే చదువుకున్నారు. కానీ బాగా చదువుకోవాలనే తపన ఆయనకు ఉండేది. ఈ నేపథ్యంలో తమ బాల్య మిత్రుడు పొట్లూరి రామబ్రహ్మం అందించిన సాయంతో ఆయన పీజీ వరకూ పూర్తి చేశారు. తరువాత రాజమహేంద్రవరంలోని వీరేశలింగం పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా చేరి, తదనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి 2010లో ఉద్యోగ విరమణ పొందారు. అయితే తనలా చదువుకోవాలనే తపన ఉన్న పేద విద్యార్థులకు ఫీజులు కట్టేందుకు ముందుకు ఉండేవారు. తరువాత వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్‌ను మిత్రులతో స్థాపించారు. అప్పటి నుంచి నిరంతరంగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రభుత్వ పింఛన్ అందని పేదలకు ప్రతి నెలా 5న రూ.500 చొప్పున అందిస్తున్నారు.

ఎంతో ఆనందంగా ఉంది




నేను సహాయం చేసిన కొంత మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి స్థానం పొందడం ఎంతో ఆనందంగా ఉంది. నేను ఏ విధంగా ఈ స్థితికి వచ్చానో గుర్తు పెట్టుకున్నాను. అందుకే ప్రతి నెలా నేను, నా మిత్రులంతా కలసి పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు పింఛన్ల రూపంలో రూ.50 వేలకు పైగా సహాయం అందిస్తున్నాం. నగరంలో ఎస్‌కేవీటీ కళాశాలలో ప్రతి నెలా 5న ఈ సాయం చేస్తున్నాం.

– పామర్తి గోపాలరావు,
విశ్రాంత ప్రిన్సిపాల్, రాజమహేంద్రవరం

ఆఖరి మజిలీ కోసం

జంగారెడ్డిగూడేనికి చెందిన ఎస్.రామచంద్రారెడ్డి మి త్రుడి తల్లి చనిపోయినప్పుడు దూరం నుంచి బంధువులు రావడానికి సమయం పట్టింది. ఈ నేపథ్యంలో మృతదేహాన్ని భద్రపరచడానికి ఇబ్బంది ఎదురైంది. దీనిని చూసి రామచంద్రారెడ్డి చలించిపోయాయి. ఇ లాంటి ఘటనల సమయంలో బాధలో ఉన్నవారికి ఏదై నా చేయాలనే ఆలోచన ఆయనకు వచ్చింది. 2004లో జంగారెడ్డిగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా ఆయన పనిచేస్తున్న సమయంలో మానవత స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. జంగారెడ్డిగూడెం నుంచి రాజమహేంద్రవరం రోడ్డులో అనేక ప్ర మాదాలు జరిగినప్పుడు సాయం కోసం ఎదురుచూసే క్షతగాత్రులను ఆదుకోవాలనే లక్ష్యంతో అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. ఈ సంస్థ జంగారెడ్డిగూడెం కేంద్రంగా ఏర్పడి ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తుంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 65 శాంతి రథాలు, 20 అంబులెన్స్‌లు, 375 ఫ్రీజర్ బాక్సులు, 20 అంబులెన్స్‌లు, 15 వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసింది.

ఆదుకోవాలనే తలంపుతో...



చనిపోయిన వారిని భద్రపరచడానికి మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా ఫ్రీజర్లు, వారిని అంత్యక్రియలకు తీసుకు వెళ్లడానికి శాంతి రథాలను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాం. బాధలో ఉన్నవారికి సాయం చేయాలనే తలంపుతో వీటిని అందుబాటులోకి తెచ్చాం. ఇవే కాకుండా వికలాంగులకు ట్రై సైకిళ్లు అందించాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 15 శాంతి రథాలు, ఫ్రీజర్లను ఉంచాం.

– కండెపు వెంకట సూర్యనారాయణ,
మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, ఉమ్మడి గోదావరి జిల్లా

అమ్మ చెప్పిందని..



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

అమ్మా నాకు జాబ్ వస్తే నీకు ఏం కావాలో చెప్పు అని కొడుకు తల్లిని అడిగాడు. అప్పుడు ఆ తల్లి నాకేం వద్దు, నీ జీతంలో కొంత భాగాన్ని అభాగ్యులు, అనాథల కోసం, వారి వైద్యానికి ఖర్చు చేయమని చెప్పడంతో ఆ మాట నుంచే సాయం పుట్టుకొచ్చింది. తన తల్లికిచ్చిన మాట కోసం కేశవభట్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక వేల మంది నిరాశ్రయులకు కేశవభట్ల శ్రీనివాసరావు సేవలందిస్తున్నారు. వివిధ రూపాల్లో పేదలను ఆదుకుంటున్నారు.

సాయం చేస్తున్నాం



ఇప్పటికి వరకూ పేదవర్గాల ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, 5 లక్షల మందికి పైగా కంటి వైద్య పరీక్షలు చేయించాం. 76 వేల మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశాం. వెయ్యి మందికి కంటి శస్త్రచికిత్సలు చేయించాం. అంతే కాకుండా రైల్వే కార్మికులకు ఉచితంగా బి య్యం ఇచ్చాం. దివ్యాంగులకు 820 ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, కృత్రిమ అవయవాలు అందించాం. ఆ తల్లి మాట కోసం సాయం చేస్తూనే ఉన్నా.

– కేశవభట్ల శ్రీనివాసరావు,
విశ్రాంత రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా బాబి



అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అల్లవరం మండలం డి.రావులపాలేనికి చెందిన పార్టీ నేత జిన్నూరి రామారావు (బాబి) పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం రాత్రి ఆయనకు నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు బాబి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ మాజీ డైరెక్టర్ అయిన బాబి తొలి నుంచీ రైతు సమస్యలపై ఉద్యమాలు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ సభ్యునిగా కూడా నియమితులయ్యారు. గతంలో దేవగుప్తం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ అధ్యక్షునిగా కూడా వ్యవహరించారు. క్షేత్ర స్థాయిలో రైతు అవసరాలపై అవగాహన ఉన్న ఆయనకు ఈ పదవి దక్కిందని రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు అన్నారు. బాబి ఎంపికపై రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి త్రినాథరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన సాత్విక్


అనపర్తి: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చిన ఘటన సోమవారం అనపర్తిలో చోటుచేసుకుంది. అనపర్తి తహసీల్దార్ కార్యాలయం వీధిలో పదేళ్ల బాలుడు సాత్విక్ ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే సమయంలో వీధిలో ఉన్న కుక్కల గుంపు అతడిపై దాడి చేసింది. బాలుడు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అప్రమత్తమై కుక్కలను తరిమేశారు. బాలుడి చేతికి లోతుగా కుక్కకాటు గాయాలయ్యాయి. బాలుడిని చికిత్స కోసం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దినదిన గండంగా మారిన కుక్కల గుంపులను జనావాసాల నుంచి ఊరి బయటకు తరలించకపోతే మరిన్ని సంఘటనలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

జ్యూయలరీ షాపు యజమాని పరారీ

తుని: మోసపూరిత మాటలతో కస్టమర్లను నమ్మించి.. మోసగించిన ఓ జ్యూయలరీ షాపు యజమాని పరారీలో ఉన్నట్టు పట్టణ సీఐ గీతా రామకృష్ణ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక నక్కినవీధిలో శ్రీశ్రీనివాసా జ్యూయలరీ పేరుతో సత్యవరం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, అతని కుటుంబ సభ్యులు బంగారం షాపు నిర్వహిస్తున్నారు. తుని, కోటనందూరు తదితర మండలాల్లో తమ కస్టమర్లకు అధిక వడ్డీ ఇస్తానని, తక్కువ ధరకే బంగారం ఇస్తానని చెప్పి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేశారు. ప్రస్తుతం వెంకటేశ్వరరావు షాపు మూసేసి పరారీలో ఉన్నట్టు తెలిసిందని సీఐ చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. బాధితులు ఇంకా ఉంటే పట్టణ సీఐ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఏ దోమ మంత్రం చాలదు

- పల్లెలు, పట్టణాల్లో విపరీతమైన దోమల సమస్య
- నిత్యం రోగాల పాలవుతున్న జనం
- ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వ్యాధిగ్రస్తులు
- నిర్మూలనకు ప్రభుత్వ యంత్రాంగం అరకొర చర్యలు
- పటిష్ట పారిశుధ్య చర్యలతోనే నివారణ సాధ్యం
- రేపు ప్రపంచ దోమల దినోత్సవం



డెంగీ, మలేరియా వ్యాధికి కారణమయ్యే ఏడిఎస్, అనాఫిలిస్ దోమలు

ఆలమూరు: దోమ సైజు చిన్నదే కానీ.. కుట్టిందంటే మాత్రం పెద్ద ప్రమాదమే. అసలే వర్షాకాలం.. విపరీతంగా కురుస్తున్న వర్షాలతో దోమలూ విజృంభిస్తున్నాయి. వీటి ద్వారా కలిగే వ్యాధులకు సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే ప్రాణాంతకం కావచ్చు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు.. సరైన పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో దోమల వ్యాప్తి సమస్యాత్మకంగా మారింది. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా, చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి.

దోమకాటుతో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, జికా వైరస్ వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉంది. ఇంగ్లాండ్‌కు చెందిన నోబెల్ అవార్డు గ్రహీత సర్ రోనాల్డ్ రాస్ 18 ఏళ్ల పాటు దోమల వల్ల సంక్రమించే వ్యాధులపై సుదీర్ఘ పరిశోధనలు చేశారు. ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా సంభవిస్తుందనే విషయాన్ని 1897 ఆగస్టు 20న కనుగొన్నారు. డబ్ల్యూహెచ్‌ఓ సూచనల మేరకు ఆ రోజును ప్రపంచ దోమల దినోత్సవం (వరల్డ్ మస్కిటో డే) జరుపుతున్నారు.

నిర్మూలన చర్యలు తప్పనిసరి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 56 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 9 సామాజిక, రెండు ఏరియా ఆస్పత్రులు, 432 వెల్‌నెస్ సెంటర్లున్నాయి. జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల ద్వారా దోమల నిర్మూలనకు వైద్యారోగ్య శాఖ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. వర్షాకాలంలో తేమ శాతం అధికంగా ఉన్న ప్రదేశాల్లో దోమల వ్యాప్తి అధికంగా ఉంటోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నిత్యం పదుల సంఖ్యలో రోగులు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దోమల నివారణకు దోమ తెరలు వాడటం, సంపూర్ణ పారిశుధ్య చర్యలు పాటించాలి. జనావాసాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డ్రైనేజీల్లో లార్వాసైడ్ క్రిమి సంహారక మందును పిచికారీ చేయాలి. ఇంటి గోడలపై సింథటిక్ పైరిథ్రాయిడ్, ఏసీఎం క్రిమి సంహారక మందును చల్లాలి.

మలేరియా లక్షణాలు

- అంటువ్యాధి మలేరియాను రక్త పరీక్ష (ఆర్‌డీ) ద్వారా నిర్ధారించవచ్చు.
- ప్లాస్మోడియం జాతికి చెందిన అనాఫిలిస్ దోమ వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుంది.
- వ్యాధిగ్రస్తుడు చలి, వణుకుతో కూడిన జ్వరం, ఒళ్లు నొప్పులతో ఇబ్బంది పడతాడు.
- వ్యాధి నిరోధక శక్తి లేనివారు విపరీతమైన తలనొప్పితో ఒక్కోసారి కోమాలోకి వెళ్లే ప్రమాదముంది.



- దోమ కుట్టిన 10 నుంచి 15 రోజుల వ్యవధిలో వ్యాధి లక్షణాలు బయటపడతాయి.
- గిరిజన ప్రాంతాల్లో ఫాల్సిపారం మలేరియా అధికంగా ఉండగా, మైదాన ప్రాంతాల్లో వైవాక్స్ జాతి మలేరియా విస్తృతంగా వ్యాపిస్తుంది.

డెంగీ నిర్ధారణ–లక్షణాలు

- ఏడిస్ ఈజిప్టి దోమకాటు ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది.
- రక్త ప్రవాహంలో గడ్డ కట్టే రక్త కణాల సంఖ్య భారీగా క్షీణిస్తాయి.
- డెంగీ వ్యాధిని ఏలీసా (ఎన్‌ఐవీ) పరీక్ష ద్వారా నిర్ధారిస్తారు.




దోమల నియంత్రణకు డ్రై డేపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది (ఫైల్)

- వ్యాధిగ్రస్తుని అవయవాలపై ఏ మేరకు ప్రభావం ఉందో గుర్తించేందుకు పూర్తి రక్త గణన, ఈ ఎకోకార్డియోగ్రఫీ, సెరోలజీ పరీక్ష, యాంటీజెన్ డిటెక్షన్, రేడియాలజీ ఇమేజింగ్, ఫైబ్రిన్ క్షీణత ఉత్పత్తి రక్త పరీక్షలు నిర్వహిస్తారు.
- జ్వరం తరచూ వస్తుంటే వైద్య నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక చికిత్స పొందాలి.
- డెంగీ జ్వరం సాధారణంగా ఉష్ణ మండల ప్రాంతంలో దోమకాటు వల్ల సోకుతుంది.

చికున్‌గున్యా నివారణ

- ఏడిస్ అల్బోపిక్టస్ జాతి దోమకాటు వల్ల చికున్‌గున్యా వస్తుంది.
- వ్యాధిగ్రస్తుడిని కుట్టిన దోమ మరొకరిని కుట్టడం ద్వారా వ్యాపిస్తుంది.
- వ్యాధి సోకిన వారికి 102 డిగ్రీలు పైబడి జ్వరం వస్తుంది.
- కీళ్ల నొప్పులు, తలనొప్పి, కండరాల నొప్పి, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయి.
- సాధారణంగా వారం నుంచి 12 రోజుల్లోపు లక్షణాలు కనిపిస్తాయి.
- వ్యాధిగ్రస్తుడు త్వరితంగా అలసట చెందుతారు.
- ఒకొక్కరికి చర్మంపై దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది.
- గర్భిణులు ప్రసవ సమయంలో చికున్‌గున్యా సోకకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.



జికా వైరస్

జికా వైరస్ వ్యాప్తి

- ఏడిస్ ఈజిప్టి దోమకాటు వల్ల జికా వైరస్ మానవుని శరీరంలోకి ప్రవేశిస్తుంది.
- వైరస్ సోకిన వ్యక్తితో లైంగిక సంపర్కం జరిపిన వారికీ వ్యాపిస్తుంది.
- దేశంలో ఈ వైరస్ ప్రభావం అంతగా లేదు.
- వైరస్ సోకినా సాధారణ జ్వరం వస్తుంది.
- చికున్‌గున్యా, డెంగీ వైరస్‌ల ద్వారానే జికా వ్యాప్తి చెందుతుంది.
- వైరస్ సోకిన వ్యక్తులకు దృష్టి సమస్యలు రావచ్చు.
- జ్వరం లక్షణాలుంటే వైద్యుల్ని సంప్రదించడం ద్వారా వైరస్ వ్యాప్తిని నిరోధించవచ్చు.

దోమల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ



వర్షాకాలం దృష్ట్యా విజృంభిస్తున్న దోమల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాం. వైద్యారోగ్య సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి, పారిశుధ్య నిర్వహణ, దోమల నియంత్రణను ప్రజలకు వివరిస్తున్నారు. అంటువ్యాధుల నివారణకు క్షేత్ర స్థాయిలో హెల్త్ అసిస్టెంట్లతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

– ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా యూనిట్ అధికారి, అమలాపురం

ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణం

తండ్రి మందలించాడని ఘాతుకం !



తోటలో వేలాడుతున్న వెంకటరమణ మృతదేహం

రాయవరం: సరిగ్గా చదవడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడినట్టు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. రాయవరం మండలం పసలపూడి శివారు సర్వారాయ తోటలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దంగేటి వెంకటరమణ(19) బలవన్మరణానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్సై డి.సురేష్‌బాబు వివరాల మేరకు, తాళ్లరేవు మండలం పటవల గ్రామానికి చెందిన వెంకటరమణ సర్వారాయతోటలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ, రామచంద్రపురంలోని వీఎస్ఎం కళాశాలలో ఈసీఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం తల్లిదండ్రుల వద్దకు పటవల గ్రామానికి వెళ్లాడు. ఆ సమయంలో కుమారుడి చదువు గురించి తండ్రి ఆరా తీసినట్టు తెలిసింది. ఫస్టియర్ సబ్జెక్టులు ఉండిపోయిన విషయాన్ని తెలుసుకుని అతడిని తండ్రి మందలించడంతో.. మనస్తాపానికి గురైన వెంకటరమణ ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

ముగిసిన సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలు



అండర్-19లో ప్రథమ స్థానం పొందిన చెన్నై ఎస్‌వీఆర్ స్కూలు జట్టు

రాజానగరం: విద్యార్థులకు చదువుతో పాటు, క్రీడలూ అవసరమని దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యా నికేతన్ కరస్పాండెంట్ సీహెచ్ విజయప్రకాష్ అన్నారు. పాఠశాల మైదానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న సీబీఎస్ఈ సౌత్ జోన్-1 హ్యాండ్ బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

విజేతలు వీరే..

అండర్-14 విభాగంలో డాల్ఫిన్ ఎలైట్ స్కూల్ (చెన్నై), వెలమలై విద్యాలయం వెస్ట్ (చెన్నై) ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు. తృతీయ స్థానంలో శ్రీప్రకాష్ విద్యా నికేతన్ (పాయకరావుపేట), ఆర్‌జీఎం స్కూలు (నంద్యాల) నిలిచాయి. అండర్-17లో రాజాజీ విద్యాలయం (చెన్నై), కవి భారతి స్కూలు (చెన్నై) తొలి రెండు స్థానాల్లో, శ్రీవిద్యా నికేతన్ (తిరుపతి), భారతీయ విద్యా భవన్ (తాడేపల్లిగూడెం) తృతీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. అండర్-19లో ఎస్‌వీఆర్ స్కూలు (చెన్నై), కికాని విద్యా మందిర్ (చెన్నై) వరుస స్థానాల్లో, శ్రీప్రకాష్ విద్యానికేతన్, వెల్లమల విద్యాలయం (విరగనూరు-చెన్నై) తృతీయ స్థానంలో నిలిచాయని టెక్నికల్ కమిటీ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.గోపీకృష్ణ వెల్లడించారు. స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.స్వామి, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ విమల, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్తకొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ, పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

నకిలీ కరెన్సీ కేసులో ముగ్గురికి జైలు

తాళ్లపూడి(కొవ్వూరు): సుమారు ఏడేళ్ల క్రితం నకిలీ కరెన్సీ కేసులో నిందితులైన ముగ్గురికి 14 ఏళ్ల జైలు, రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని కొవ్వూరు రూరల్ ఎస్సై కె.శ్రీహరి సోమవారం తెలిపారు. కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2018లో కొవ్వూరు మండలం ఐ.పంగిడికి చెందిన చదలవాడ అనిల్‌కుమార్, నర్సీపట్నానికి చెందిన తోమండ్రా రంజిత్ సింగ్, ఏలూరుకు చెందిన ఎల్లంపల్లి శ్రీనివాసరావు, మరో ముగ్గురిపై నకిలీ కరెన్సీ తయారు చేస్తున్నట్టు కేసు నమోదైంది. అప్పటి ఎస్సై ఎం.అర్జున్‌రాజు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. ఎస్సై ఎం.జైబాబు దర్యాప్తు చేసి, చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుతం కొవ్వూరు రూరల్ ఎస్సై కె.శ్రీహరి ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ ఎం.మేఘనాథం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ సమయంలో నిందితులు తాడి వెంకటరమణారెడ్డి, తిగురుపల్లి వెంకటేశ్వరరావు, మండా నాగిరెడ్డి చనిపోయారు. మిగిలిన ముగ్గురిపై నేరం రుజువు కావడంతో.. ప్రిన్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవీఎల్ సరస్వతి వారికి ఒక్కొక్కరికి 14 ఏళ్ల జైలు, రూ.10 వేల వంతున జరిమానా విధించారు.

చోరీ కేసులో రెండేళ్ల జైలు

తాళ్లపూడి: పెద్దేవంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కొవ్వూరు సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి సోమవారం తీర్పు చెప్పారు. ఎస్సై టి.రామకృష్ణ వివరాల మేరకు, పెద్దేవం గ్రామానికి చెందిన జి.శిరీష ఇంట్లో చోరీ జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో భీమోలు గ్రామానికి చెందిన చుక్కపల్లి బాబి అలియాస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద ఐదు కాసుల బంగారం రికవరీ చేశారు. కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో, న్యాయమూర్తి శిక్ష విధించారు.

సోషల్ మీడియాలో అంతర్వేది మూలవిరాట్ దర్శనం

ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్ ఫొటో జేఆర్ఎన్ (జర్నలిస్ట్ రవి న్యూస్)పేరుతో ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ అయిన సంగతి ఆలస్యంగా వెలుగుచూసింది. మూలవిరాట్ ఫొటోలు సోషల్ మీడియాలో నెటిజన్లు చూడడంతో విషయం సోమవారం బయటకు వచ్చింది. దేవస్థానం నిబంధనల ప్రకారం అంతరాలయంలో స్వామివారి మూలవిరాట్ ఫొటో తీయడం నిషేధం. ఇక్కడ వీడియో/కెమెరాలు నిషేధమంటూ ప్రకటనను కూడా దేవస్థానం ఏర్పాటు చేసింది. ఏమైందో ఏమో కానీ.. ఫేస్‌బుక్ వేదికగా మూలవిరాట్ దర్శనమివ్వడం సర్వత్రా విస్మయం కలిగిస్తోంది. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని పాలకొల్లుకు చెందిన ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ దర్శించుకున్నారంటూ, అంతరాలయంలో స్వామి వారి మూలవిరాట్, ఆ వ్యక్తితో కలిపి తీసిన ఫొటోను జేఆర్ఎన్ జర్నలిస్ట్ ఫేస్‌బుక్‌లో మూడు రోజుల క్రితం అప్‌లోడ్ అయింది. సర్వాభరణాల అలంకరణలో ఉన్న స్వామి మూలవిరాట్ ఫొటో కూడా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడం ఎంత వరకు సమంజసమని భక్తులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్‌ను వివరణ కోరగా, ఆలయంలోని సీసీ కెమెరాలను పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల కొరతతో రైతుల ఇబ్బందులు

గోకవరం: కామరాజుపేటలో ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీవేణుగోపాల వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సొసైటీ కార్యాలయం వద్ద ఒక్కొక్కరికీ ఒక్క బస్తా యూరియా మాత్రమే సరఫరా చేయడంపై రైతులు మండిపడ్డారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో ఎరువులు సక్రమంగా సరఫరా చేయడం లేదని వాపోతున్నారు. జగ్గంపేట ఏఎంసీ చైర్మన్ అడపా భరతకుమార్ సొంత గ్రామంలో ఈ పరిస్థితి ఏర్పడడం విడ్డూరం. సొసైటీ కార్యదర్శి కామిశెట్టి వీరభద్రరావు మాట్లాడుతూ, ఆదివారం రైతులకు సరిపడా యూరియా అందించలేకపోవడం వాస్తవమేనన్నారు. పది టన్నుల యూరియా వచ్చిందని, అందరికీ సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఒక్క బస్తా మాత్రమే ఇచ్చామన్నారు.

మస్కట్ నుంచి స్వదేశానికి చేరిక

నకిలీ ఏజెంట్ చేతిలో మోసపోయి ఇరుక్కున్న మహిళ



కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసిన సుహాసిని, ఆమె బంధువులు

అమలాపురం రూరల్: నకిలీ ఏజెంట్ చేతిలో మోసపోయి మస్కట్ దేశంలో ఇబ్బందులు పడుతున్న మహిళను కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులు స్వదేశానికి రప్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం పట్టణం వడ్డెగూడేనికి చెందిన బొంతు సుహాసిని(31) ఉపాధి కోసం నకిలీ ఏజెంట్ ద్వారా ఈ ఏడాది మార్చిలో మస్కట్‌కు వెళ్లింది. అక్కడ పనిలో చేరిన ఆమెను యజమాని శారీరకంగా, మానసికంగా వేధించాడు. దీంతో తనను రక్షించి, స్వదేశానికి తీసుకు వెళ్లాలంటూ భర్తను వేడుకుంది. ఆమె భర్త కొండలరావు దీనిపై కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులను ఆశ్రయించారు. వారి విన్నపంపై స్పందించిన కలెక్టర్ మహేష్‌కుమార్ వెంటనే భారత రాయబార సంస్థ ద్వారా సంప్రదింపులు జరిపారు. బాధితురాలిని స్వదేశానికి తీసుకు రావాలని నోడల్ అధికారి కె.మాధవిని ఆదేశించారు. అధికారులు ఆ నకిలీ ఏజెంట్, మస్కట్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఈ ప్రయత్నాలు ఫలించడంతో భారత విదేశీ రాయబార మంత్రిత్వ శాఖ సహకారంతో సుహాసిని స్వదేశానికి సురక్షితంగా చేరింది. బాధితురాలు సుహాసిని తన బంధువులతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపింది.

పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన

తాళ్లరేవు: కోరంగి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నిమ్మితి ఏసు, అరబరుకుల లక్ష్మి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు, బాధిత కుటుంబ సభ్యులు సోమవారం ఆందోళన చేపట్టారు. కోరంగి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గంటసేపు ఆందోళన కొనసాగడంతో రహదారిలో వాహనాలు నిలిచిపోయాయి. అమలాపురం–కాకినాడ రోడ్డులో వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆందోళనకారులతో కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, నాయకులు మాట్లాడారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జీవన వేదం

సృష్టిలో ఉద్భవించిన ప్రతి వస్తువూ కాల గర్భంలో కలిసిపోతుంది. అది మనిషైనా.. మానైనా ఒక్కటే. బతుకు పోరాటంలో ఎన్నో కష్టాలు ఎదురవుతుంటాయి. వాటన్నింటినీ అధిగమించి ముందుకు సాగిపోవడమే మానవుని కర్తవ్యం. బాల్యం నుంచి ముదుసలి వరకూ ఎన్నో అనుభవాలు.. అనుభూతులు. గడిచిపోయిన కాలం తిరిగి రాకపోయినా.. ఆ జ్ఞాపకాలను మాత్రం ఛాయాచిత్రం పదిలంగా ఉంచుతుంది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కొన్ని అపురూప దృశ్యాలు. ఫొటోలు: గరగ ప్రసాద్, సాక్షి, రాజమహేంద్రవరం



జీవన వేట: పాపికొండల వద్ద చేపల వేట సాగిస్తున్న మత్స్యకారుడు




నీటి బాట: ఏజెన్సీ ప్రాంతంలో బిందెలతో నీళ్లు తెస్తున్న గిరిజన మహిళలు



బాల్యం.. అమూల్యం: ఏజెన్సీలోని మారేడుమిల్లిలో చిన్నారుల ఆట



ప్రకృతి ఆకృతి: రావులపాలెం మండలం ఈతకోట వద్ద ఆకాశాన కారు మబ్బులు



పొద్దుపోయే దాకా: రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద వేట ముగించి తిరిగొస్తున్న నావ